



పదవ తరగతి పరీక్షలకు సంబంధించిన
కార్యాచరణ ప్రణాళికను జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా తదితరులు

రేషన్ షాపులపై కన్ను..

జిల్లాలో 117 చౌక దుకాణాలు ఖాళీ

కలెక్టర్‌తో కూటమి నేతలు భేటీ

మొన్నటి వరకు మద్యం షాపులపై దృష్టి సారించిన కూటమి పార్టీల నేతలు ఇప్పుడు రేషన్ షాపులపై కన్ను వేశారు. కొత్త రేషన్ షాపులను తమ అనుచరులకు కట్టబెట్టేందుకు కూటమి నేతలు సిఫార్సులు చేస్తున్నారు. వచ్చే వారంలో కొత్త రేషన్ షాపులకు ఆమోదముద్ర పడనుంది.



ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

కర్నూలు జిల్లాలో దాదాపుగా 1233 రేషన్ దుకాణాలు ఉన్నాయి. ఇందులో 117 రేషన్ దుకాణాలకు డీలర్లు లేరు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం కొత్త రేషన్ షాప్‌ల మంజూరుకు చర్యలు తీసుకుంది. అందుకు సంబంధించి విధి విధానాలను కూడా పౌరసరఫరాల శాఖ విడుదల చేసింది. కొత్త రేషన్ దుకాణాలకు గ్రామీణ, పట్టణ, మున్సిపల్, కార్పొరేషన్ ప్రాంతాల వారీగా కార్డుల సంఖ్యను కూడా నిర్ణయించింది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అనేక రేషన్ షాపుల్లో వెయ్యికి పైగానే రేషన్ కార్డులు ఉన్నాయి. ఇప్పుడు కొత్తగా జారీ చేసిన నిబంధనలు ప్రకారం గ్రామీణ ప్రాంతాల్లో 450 సంఖ్యకు తగ్గకుండా రేషన్ దుకాణం ఏర్పాటు చేయనున్నారు. మున్సిపాలిటీ ప్రాంతంలో 550 నుండి 600 కార్డులకు కొత్త రేషన్ దుకాణం ఏర్పాటు చేస్తున్నారు. కర్నూల్ మున్సిపల్ కార్పొరేషన్ లాంటి ప్రాంతంలో 65 నుండి 800 పైగా రేషన్ కార్డులను ఆధారంగా చేసుకుని ఏర్పాటు చేస్తున్నారు.

అధికార పార్టీ నేతలు సిఫార్సు లేఖలు

కొత్త రేషన్ దుకాణాల మంజూరు ప్రక్రియను డిసెంబర్ మొదటి వారానికి పూర్తి చేయాలని పౌరసరఫరాల శాఖ ఉత్తర్వులు ఇచ్చింది. రాష్ట్రంలో అధికారం మారగానే కూటమి నేతలు తమ అనుచరులకు కొత్త రేషన్ దుకాణం మంజూరుకు పేర్లను కూడా సిఫార్సు చేసి జిల్లా కలెక్టర్‌కు పంపారు. ఇప్పుడు కొత్తగా జారీ చేసిన నిబంధనల ప్రకారం ఆయా నియోజకవర్గాల్లో పెరగనున్న రేషన్ దుకాణాల ఆధారంగా కిందిస్థాయి కార్యకర్తలకు సిఫార్సు చేశారు.

జిల్లా కలెక్టర్‌తో కూటమి నేతలు భేటీ

జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషాను గురువారం అధికార తెలుగుదేశం, బిజెపి, జనసేన పార్టీలకు చెందిన ముఖ్య నేతలు కలిసి సమావేశం అయ్యారు. కొత్త రేషన్ షాపుల మంజూరుకు సంబంధించి జిల్లా కలెక్టర్‌తో సుదీర్ఘంగా చర్చించారు. ఆయా నియోజకవర్గాల వారిగా వారు సూచించిన పేర్లకు ఆమోదముద్ర వేయాలని జాబితాలతో అందజేశారు. జిల్లా కలెక్టర్ కూడా అధికార పార్టీ నేతలు ఇచ్చిన సిఫార్సులను ఆధారంగా చేసుకొని కొత్త రేషన్ షాపుల సంఖ్య కూడా అధికార పార్టీ నేతల సిఫార్సు మేరకే జిల్లా కలెక్టర్ వేసినట్లు తెలిసింది. ఆర్‌డిఒలు కొత్త రేషన్ షాపులకు నోటిఫికేషన్ జారీ చేసి రేషన్ డీలర్ పోస్టులను భర్తీ చేయనున్నారు. కొత్త రేషన్ దుకాణాలు మంజూరు కాగానే సిఫార్సు చేసిన పేర్లనే రేషన్ డీలర్లుగా ఎంపిక చేయనున్నారు.

అమిత్ షాను బర్తరఫ్ చేయాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్
- సుందరయ్య జంక్షన్‌లో అమిత్ షా చిత్రపటం దగ్ధం
- అంబేద్కర్ సర్కిల్‌లో కాంగ్రెస్ పార్టీ నిరసన



నిరసన చేపడుతున్న సిపిఎం, సిఐటియు, కెవిపిఎస్ నాయకులు

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

పార్లమెంట్ సాక్షిగా బాబా సాహెబ్ అంబేద్కర్‌ను అవమానించిన అమిత్ షాను పార్లమెంట్ నుండి బర్తరఫ్ చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయి డిమాండ్ చేశారు. అమిత్ షాను బర్తరఫ్ చేసి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం కర్నూలు నగరంలోని సుందరయ్య జంక్షన్‌లో అమిత్ షా ఫోటోలను దగ్ధం చేసి నిరసన తెలిపారు. సిపిఎం న్యూసిటి కార్యదర్శి టి రాముడు అధ్యక్షతన జరిగిన నిరసన కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయి, సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్.రాధాకృష్ణ, కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి ఆనంద్ బాబు మాట్లాడారు. అంబేద్కర్ పేరును క్షమించడానికి కూడా సహించలేని స్థితిలో బిజెపి ప్రభుత్వం ఉందని విమర్శించారు. ఈ వ్యాఖ్యల వల్ల రాజ్యాంగ నిర్మాత పట్ల అమిత్ షాకు, బిజెపికి ఉండే వైఖరి స్పష్టమవుతోందన్నారు. ఇంత జరుగుతున్నా నరేంద్ర మోడీ మౌనంగా ఉండడం అనేది అమిత్ షాను వెనకవేసుకుని రావడమేనని, ఇది దుర్మార్గమైన చర్య అన్నారు. పార్లమెంటు సాక్షిగానే మత విద్వేషాలు సృష్టించే ప్రయత్నం చేస్తున్నారని, దేశ సమగ్రతకు, సమైఖ్యతకు ఆటంకం కలిగించే విధానాన్ని ముందుకు తెస్తున్నారన్నారు. ప్రధానమంత్రి తక్షణమే స్పందించి హోం మంత్రి అమిత్ షాను బర్తరఫ్ చేయాలని, ఆయన పార్లమెంటు సభ్యత్వం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం ఓల్డ్ సిటీ కార్యదర్శి ఎం రాజశేఖర్, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రాఘవేంద్ర, నగేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా, నగర కార్యదర్శి సాయి ఉదయ్, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు దేవ సహాయం, ఉపాధ్యక్షులు కృష్ణ, జయరాజు, కరుణాకర్, తిక్కప్ప, మారయ్య, నగర కార్యదర్శి భాస్కర్, నాయకులు రోశయ్య, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన

కర్నూలు కలెక్టరేట్ : భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర మంత్రి అమిత్ షా ని మంత్రి పదవి నుంచి వెంటనే తొలగించాలని కాంగ్రెస్ పార్టీ కర్నూలు నగర అధ్యక్షులు షేక్ జిలాని బాషా డిమాండ్ చేశారు. నగరంలోని స్థానిక అంబేద్కర్ సర్కిల్ వద్ద కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. నగర అధ్యక్షులు జిలాని బాషా, మాజీ ఎమ్మెల్సీ సుధాకర్ బాబు మాట్లాడుతూ ప్రధాని మోడీ తక్షణమే అమిత్ షాతో దేశ ప్రజలకు క్షమాపణ చెప్పించాలని, చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ముందుగా కాంగ్రెస్ నాయకులు పార్టీ కార్యాలయం నుండి బయలుదేరి స్థానిక పాత బస్టాండ్‌లోని అంబేద్కర్ కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి మూలింటి మారెప్ప, ఐఎన్టియుసి జిల్లా అధ్యక్షులు బి బతుకన్న, ప్రధాన కార్యదర్శి ఎన్ సుంకన్న, కాంగ్రెస్ నాయకులు అనంతరత్నం మాదిగ, షేక్ ఖాజా హుస్సేన్, ఖాద్రీ పాషా, షేక్ మాలిక్, డబ్ల్యూ సత్యరాజు, అబ్దుల్, జాన్ సదానందం, ప్రతాప్, రంగస్వామి, వెంకట శేషగిరి మొదలగు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నగర అధ్యక్షుడు జిలానీ బాషా, మాజీ ఎమ్మెల్సీ సుధాకర్ బాబు

పదో తరగతి పరీక్షల్లో

ప్రతి విద్యార్థీ ఉత్తీర్ణత సాధించాలి

- జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

పదవ తరగతి పరీక్షల్లో ప్రతి విద్యార్థీ ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో పదవ తరగతి పరీక్షల ఉత్తీర్ణత శాతం పెంపుపై జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రెండు వారాలుగా విద్యార్థులందరికీ వర్చువల్ ద్వారా తరగతులు, విద్యాబోధన చేయనున్నట్లు తెలిపారు. ఈ మూడు నెలలు పదవ తరగతి పరీక్షలు పూర్తి అయ్యేంతవరకు ఉపాధ్యాయులకు మెడికల్ ఎమర్జెన్సీ, జెన్యూన్ రీజన్ ఉంటే తప్ప దీర్ఘకాలిక సెలవులు మంజూరు చేయకూడదని ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. వ్యక్తిగత, ప్రైవేట్ అఫైర్స్ మీద సెలవు మంజూరు చేసి ఉంటే వారి సెలవులు రద్దు చేసి వెనక్కి పిలిపించాలని డిఇఒను ఆదేశించారు. కొంతమంది విద్యార్థుల భవిష్యత్తు ఈ పరీక్షల మీద ఆధారపడి ఉందని ఉపాధ్యాయులు గుర్తు పెట్టుకోవాలని పేర్కొన్నారు. పదవ తరగతి విద్యార్థులు ఏ సబ్జెక్టులోనూ ఫెయిల్ కాకూడదని, ఆ మేరకు లక్ష్యాలను నిర్దేశించుకోవాలని ఆదేశించారు. ప్రతి ఉపాధ్యాయునికి రెస్పాన్సిబిలిటీని ఫిక్స్ చేయాలన్నారు. హెడ్ మాస్టర్‌తో పాటు ఏ సబ్జెక్టులో ఫెయిల్ అయితే ఆ టీచర్ కూడా బాధ్యత తీసుకోవాలన్నారు. ప్రతి విద్యార్థి మీద ఫోకస్ ఉండాలన్నారు. ప్రధానంగా బి, సి గ్రేడ్ విద్యార్థుల మీద ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. వసతి గృహాల్లో వార్డెన్స్ కూడా పదవ తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. డిప్యూటీ డిఇఒలు, ఎంఇఒలు వారి మండలాల పరిధిలోని అన్ని పాఠశాలలకు వెళ్లి ఈ అంశంపై పర్యవేక్షించాలని ఆదేశించారు. లోపాలు ఏమైనా ఉంటే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసే విధంగా చూడాలని సూచించారు. పాఠశాలల్లో సిలబస్ పూర్తి అయింది కాబట్టి ఈ మూడు నెలలు పూర్తిగా పరీక్షలకు విద్యార్థులను పూర్తిగా సన్నద్ధం చేయాలన్నారు. వలసలు వెళ్లే గ్రామాల్లో పదవ తరగతి పరీక్షలు రాసే విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడాలన్నారు. ఈ మూడు నెలలు పాఠశాలలకు రాకపోతే ఫెయిల్ అవుతారని చెప్పేలా, టీచర్లు, విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించాలని డీఈవోను ఆదేశించారు. కర్ణాటక సరిహద్దు గ్రామాల్లో కన్నడ భాష ఎక్కువగా మాట్లాడతారని కొంతమంది ఉపాధ్యాయులు కలెక్టర్ దృష్టికి తీసుకు రాగా ఏ మీడియంలోనైనా పరీక్షలు రాసే అవకాశం ఉందని, ఆ మేరకు పరీక్షలు రాసేలా వారిని సన్నద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఉత్తమ ఫలితాలు సాధించడానికి కృషి చేసిన టీచర్స్ బెస్ట్ ప్రాక్టీసెస్ కూడా రికార్డ్ చేస్తామని తెలిపారు. ఎయిడెడ్ పాఠశాలల్లో తక్కువ పాస్ పర్సంటేజ్ రావడం పట్ల కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేస్తూ, వచ్చే సంవత్సరంలో ఈ విధమైన పరిస్థితి రాకూడదని డిఈఓను, పాఠశాలల ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. అనంతరం పదవ తరగతి పరీక్షలకు సంబంధించిన కార్యాచరణ ప్రణాళికను కలెక్టర్ ఆవిష్కరించారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డిఈఓ శామ్యూల్ పాల్, బిసి సంక్షేమ అధికారి వెంకటలక్ష్మి, డిసిఓ శ్రీదేవి, అసిస్టెంట్ కమిషనర్ చంద్రభూషణం, ఎంఇఒలు, ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారమే లక్ష్యం

- జాయింట్ కలెక్టర్ నవ్య

ప్రజాశక్తి-వెల్దుర్తి

రెవెన్యూ సదస్సులలో భూ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య అన్నారు. వెల్దుర్తి మండల కేంద్రంలోని ఎస్ బోయినపల్లి గ్రామంలో గురువారం తాహసిల్దార్ చంద్రశేఖర్ వర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో జాయింట్ కలెక్టర్ నవ్య పాల్గొన్నారు. రైతులతో దరఖాస్తులను స్వీకరించి వారితో మాట్లాడారు. రికార్డులలోని సమస్యలను భూ సరిహద్దు వివాదాలను రెవెన్యూ సదస్సులలో అధికారుల దృష్టికి తీసుకొని రావాలని అన్నారు. పొలాలలోని సరిహద్దు రాళ్లను కొందరు అక్రమంగా తీసివేశారని రైతులు జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్లారు. పొలాల సరిహద్దు రాళ్ళను ఎవరైనా అక్రమంగా తొలగిస్తే వారిపై రెవెన్యూ చట్టపరమైన చర్యలు ఉంటాయని పేర్కొన్నారు. సరిహద్దుల్లో తీసివేసిన రాళ్లను తక్షణమే రెవెన్యూ సిబ్బంది వెళ్లి కొలతలలో తేడాలను గుర్తించి సరైన చోట రాళ్ళను ఉంచాలని సిబ్బందికి ఆదేశించారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ హేమంత్ రెడ్డి, వీఆర్వో ఉమన్న, టిడిపి నాయకులు కాంతారెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. **పత్తికొండ :** రెవిన్యూ సదస్సులోని వచ్చిన భూ సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని పత్తికొండ తాసిల్దార్ రమేష్ అన్నారు. పత్తికొండ గ్రామ సచివాలయం-3లో విఆర్ఓ సాగర్ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు ఏర్పాటు చేశారు. తాసిల్దార్ రమేష్ పాల్గొని మాట్లాడారు. సమస్యల పరిష్కారం కోసం 24 అర్జీలు వచ్చాయన్నారు. ఆర్ఐ శ్రీనివాసులు, మండల సర్వే యర్ గాది లింగప్ప, వీఆర్వో బ్రహ్మయ్య, రవి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ నవ్య



మాట్లాడుతున్న అంజిబాబు

విద్యుత్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా పోరాటం


ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

విద్యుత్ ప్రవేటీకరణకు వ్యతిరేకంగా ఐక్య పోరాటాలు నిర్వహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్‌డి.అంజిబాబు అన్నారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న ఆందోళనలో భాగంగా విద్యుత్ ఉద్యోగుల కోఆర్డినేషన్ కమిటీ ఆధ్వర్యంలో విద్యుత్ ఎస్ఈ కార్యాలయం దగ్గర గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. లాభాలు గడించే చండీఘర్ విద్యుత్తు సంస్థను ప్రైవేటీకరించాలని ప్రయత్నిస్తున్నారని ఆయన విమర్శించారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా డిసెంబర్ 25న చలో చండీగర్ పిలుపు రోజున సిఐటియు ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా సంఘీభావ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర నాయకులు నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

నూతన దంపతులకు ప్రముఖుల ఆశీర్వాదం

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

ఆటో యూనియన్ (సిఐటియు) జిల్లా కార్యదర్శి కె.ప్రభాకర్ కుమారుడు కె.శివకుమార్, ఎ.జయసుధల వివాహ రిసెప్షన్ నగరంలోని వెంకటాద్రి నగర్, వివిఎస్ ఫంక్షన్ హాలులో గురువారం ఘనంగా నిర్వహించారు. పలువురు హాజరయి నూతన వధువరులను ఆశీర్వదించారు. ఎపిఎస్‌పి బెటాలియన్ డీఎస్పీ మహబూబ్ బాష, కర్నూలు ఇన్‌ఛార్జీ ఆర్‌టిఒ రవీంద్రకుమార్, సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్, ఆలిండియా రోడ్ ట్రాన్స్ పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముజఫర్ అహ్మద్, ఆటో యూనియన్ నెల్లూరు జిల్లా కార్యదర్శి సురేష్, అనంతపురం కార్యదర్శి శ్రీనివాసులు, సత్యసాయి జిల్లా కార్యదర్శి మహ్మద్ రఫీ, సిపిఎం న్యూసిటీ కార్యదర్శి టి.రాముడు, రాజశేఖర్, సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పిఎస్.రాధాకృష్ణ, ఎమ్‌డి.అంజిబాబు, జిల్లా నాయకులు సాయిబాబా, విజయ్, నాగేశ్వరరావు, సిపిఎం 32వ వార్డు నాయకులు ఆనంద్, విజయ్ కుమార్, దావీదు, ఆటో యూనియన్ నాయకులు రాధాకృష్ణ, మహ్మద్ హుస్సేన్, షంషీర్, బాష వలీ, మల్లి, నబీ, ఐద్వా జిల్లా కార్యదర్శి అలివేలమ్మ, ధనలక్ష్మి, లక్ష్మీబాయి, దానమ్మ, ఓబులమ్మ, సిపిఎం నాయకులు ఏసు, మహ్మద్ రఫీ, మిత్రులు మద్దిలేటి ఆశీర్వదించారు.




వధువరులను ఆశీర్వదిస్తున్న ప్రముఖులు

శ్మశాన వాటికకు స్థలం కేటాయించండి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాఘవేంద్ర కోరారు. గురువారం ఉల్చాల గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సులో డివైఎఫ్ఐ జిల్లా నాయకులు అబ్దుల్లా, మండల నాయకులు అంజి గ్రామ పెద్దలు కల్లు శివన్న, హనుమంతు, ఇస్మాయిల్, వెంకటేశ్వర్లు, సురేష్‌లతో కలిసి వినతిపత్రం అందజేశారు. డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాఘవేంద్ర మాట్లాడుతూ కర్నూలు మండలం ఉల్చాల గ్రామంలోని హిందూ స్మశాన వాటికకు స్థలం కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. దాదాపు 60 సంవత్సరాల కిందట గ్రామంలోని సర్వే నంబర్ 443లో అప్పుడుజనాభా కు అనుగుణంగా ఒక ఎకరా భూమి కేటాయించారని అన్నారు. అందులో కూడా 80 సెంట్ల స్థలం బండ ఉన్న కారణంగా దానిని ఉపయోగించుకోకుండా ఉన్న స్థలాన్ని ఉపయోగిస్తూ వచ్చారని తెలియజేశారు. ఇప్పుడు గ్రామ జనాభా 10,000 మంది ఉంటారని అందులో మైనార్టీలు, క్రైస్తవులు మినహాయిస్తే మిగతా వారు దాదాపు 6000 మంది ఉంటారని, 6000 మంది జనాభాకు 20 సెంట్ల స్థలం ఏ మాత్రం సరిపోదని తెలియజేశారు. ఒక్క 2024 సంవత్సరంలోనే దాదాపు 40 మంది ఆ గ్రామంలో మరణించారని అన్నారు. స్థలం సరిపోక పూడ్చిన శవాన్ని ఆరు నెలలు గడవకముందే తీయాల్సిన పరిస్థితి ఉందని తెలియచేశారు. దానివల్ల గుంతలు తీసే వాళ్ళ, గ్రామ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలియజేశారు. గతంలో మిగిలిన 80 సెంట్ల భూమిలో కూడా ఇప్పుడు ప్రభుత్వ కార్యాలయాలు నిర్మించారని, వెంటనే గ్రామ జనాభాకు అనుగుణంగా రెండు ఎకరాల స్థలం స్మశానం కోసం కేటాయించాలని, స్మశానం చుట్టూ ప్రహరీ గోడ నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. తహశీల్దార్ స్పందిస్తూ త్వరలో గ్రామంలో స్థలాన్ని గుర్తించి స్మశాన వాటిక కోసం ఇస్తామని హామీ ఇచ్చారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

హైవేపై ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మించాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు రామకృష్ణ

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

నన్నూరు సమీపంలో హైవేపై నిర్మించిన ఫుట్ ఓవర్ బ్రిడ్జి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందని, హైవేపై ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు జి.రామకృష్ణ కోరారు. గురువారం ఓర్వకల్లు ప్రజాసంఘాలు కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. రామకృష్ణ, సిపిఎం మండల కార్యదర్శి బి.నాగన్న, నన్నూరు శాఖ కార్యదర్శి ఎస్.మధు సూదన్ మాట్లాడారు. హైవేపై ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని గతంలో అనేకసార్లు హైవే అథారిటీ అధికారులకు, కలెక్టర్‌కు వినతి పత్రాలు ఇచ్చినా స్పందించలేదని తెలిపారు. ఈ రోడ్డును దాటే క్రమంలో అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్కూల్ విద్యార్థులు రోజూ మూడుసార్లు 600 మంది విద్యార్థులు రోడ్డు దాటాలని, ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని తెలిపారు. గతంలో విద్యార్థులను సిపిఎం కార్యకర్తలు రోడ్డు దాటించేవారని, తర్వాత టోల్ గేట్ నిర్వాహకులు విద్యార్థులను రోడ్డు దాటించేవారని చెప్పారు. హైవేపై ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టి ప్రజలు, విద్యార్థుల ప్రాణాలను కాపాడాలని డిమాండ్ చేశారు

అశ్వగంధ పంట సందర్శన

ప్రజాశక్తి - మద్దికెర

మద్దికెర గ్రామంలో సాగు చేస్తున ఔషధ పంట అశ్వగంధను ఉద్యాన పరిశోధన స్థానం వెంకన్న గూడెం, శాస్త్రవేత్తలు డాక్టర్ టి.నాగలక్ష్మి, డాక్టర్ డి.రంగన్న, డాక్టర్ ఎస్.ఆదర్శలు గురువారం క్షేత్రస్థాయి సందర్శన చేపట్టారు. పంటను ఆశిస్తున్న కీటకాలు, తెగుళ్లను నమోదు చేసుకోవడంతో పాటు, మేలైన పంట సాగు పద్ధతులను రైతులకు వివరించారు. పంట సాగులో మెళకువలపై రైతులకు అవగాహన కల్పించారు. ఉద్యాన అధికారి డాక్టర్ ఇందిర, ఉద్యాన అధికారులు, వ్యవసాయ అధికారి యు.రవి సహకారంతో పంట క్షేత్ర సందర్శనలు నిర్వహించారు. ఎఇఒ భోజరాజు, వ్యవసాయ సహాయకులు జాకీర్ హుస్సేన్, ఆనంద్, రాణి పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాలను ఎఒ తనిఖీ

ప్రజాశక్తి - సిబెళగల్

మండలంలోని ఆయా ఎరువులు, పురుగు మందుల దుకాణాలను ఏఓ మల్లేష్ కుమార్ గురువారం తనిఖీ చేపట్టారు. స్టాకు బోర్డును, స్టాకు వివరాలను, రిజిస్టర్లను పరిశీలించి రైతులకు అవసరమైన ఎరువులు, మందులు ఎంఆర్‌పి ధరలకే అమ్మాలని అన్నారు. ఎవరైనా అధికంగా అమ్మినట్లు తెలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే వివిధ రకాల మందుల నమూనాలను సేకరించి విశాఖపట్నం, తాడేపల్లి గూడెంలకు పరీక్షల నిమిత్తం పంపడం జరుగుతుందన్నారు.

మున్సిపల్ లాంగ్వేజ్ పండిట్ పోస్టులను భర్తీ చేయాలి : ఎంటిఎఫ్

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

మున్సిపల్ ఉపాధ్యాయుల ప్రమోషన్స్ కోసం అక్టోబర్ నెలలో షెడ్యూలు విడుదల చేసిన విద్యాశాఖ ఎట్టకేలకు కర్నూలు జిల్లాలో 70 : 30 విధానంలో జరిగిన లోపాలను సరిచేసి వేకెన్సీ పొజిషన్ ప్రకటించడం పట్ల ఆంధ్రప్రదేశ్ పురపాలక ఉపాధ్యాయుల సమాఖ్య జిల్లా కార్యదర్శి పి.కోటన్న గురువారం హర్షం వ్యక్తం చేశారు. లాంగ్వేజ్ పండిట్ పోస్టుల భర్తీ విషయంలో కూడా జిల్లా విద్యాశాఖ అధికారులు చొరవ చూపాలని కోరారు. మున్సిపల్ పాఠశాలల్లో భాషల బోధనా ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉందని, దాదాపు 2 వేల మంది విద్యార్థులకు ఇద్దరు, ముగ్గురు భాషా ఉపాధ్యాయులు పనిచేస్తున్నారని తెలిపారు. ప్రమోషన్స్ ద్వారా ఉద్యోగోన్నతి పొందిన, ఇదివరకే ఖాళీగా ఉన్న భాషా ఉపాధ్యాయుల పోస్టులు భర్తీ చేసి మున్సిపల్ విద్యా వ్యవస్థ అభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు.



హర్షం వ్యక్తం చేస్తున్న ఎంటిఎఫ్ నాయకులు

అమిత్ షాను మంత్రి పదవి నుంచి తొలగించాలి

కర్నూలు కార్పొరేషన్ : అంబేద్కర్‌ను అవమానించిన అమిత్‌షా క్షమాపణ చెప్పాలని నేషనల్ లాయర్స్ ఫోరమ్ ప్రెసిడెంట్, ఏపీ హైకోర్టు సీనియర్ న్యాయవాది వై.జయరాజు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అంబేద్కర్ భారత రాజ్యాంగాన్ని అందించ డం ద్వారా ఈ దేశంలోని కోట్లాది ప్రజలకు ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ తరగతులు, మైనారిటీలు, మహిళలకు జీవితాన్ని అందించారని తెలిపారు. పార్లమెంట్‌లో బాబాసాహెబ్ అంబేద్కర్‌ను అవమానించిన ఘటనపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. **తుగ్గలి :** అమిత్‌షాను అవమానించిన అమిత్‌షా క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ పార్టీ ఓబిసి తాలూకా చైర్మన్ నాగార్జున యాదవ్ డిమాండ్ చేశారు. గురువారం జొన్నగిరిలో ఆయన విలేకరులతో మాట్లాడారు.

చెత్త సంపద తయారీ కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి - వెల్దుర్తి

మండలంలోని రామళ్లకోట, నరసాపురం, నార్లపురం గ్రామాల్లోని చెత్త సంపద తయారీ కేంద్రాలను గురువారం డిఎల్‌పిఒ లక్ష్మి పరిశీలించారు. ఈ కేంద్రాల ను నిరుపయోగంగా ఉంచరాదని, గ్రామాల్లో సేకరించిన చెత్తను తడి, పొడి చెత్తగా వేరుగా చేసి వర్మీ కంపోస్టును తయారు చేసి విక్రయించి పంచాయతీలకు సంపద దృష్టించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జిల్లా కోఆర్డినేటర్ మంజులవాణి పాల్గొన్నారు.



టిడిపి నాయకులను సన్మానిస్తున్న సాగునీటి సంఘం సభ్యులు

టిడిపి నాయకులకు సన్మానం

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

టిడిపి నాయకులను సాగునీటి సంఘం సభ్యులు సన్మానించారు. గురువారం టిడిపి జిల్లా కార్యాలయంలో టిడిపి జిల్లా అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి, ఎమ్మెల్యే కెఇ.శ్యాం కుమార్, బొగ్గుల దస్తగిరి, మంత్రాలయం ఇన్‌ఛార్జ్ ఎన్.రాఘవేంద్ర రెడ్డి, కోడుమూరు నియోజకవర్గ ముఖ్య నాయకులు డి.విష్ణువర్ధన్ రెడ్డిని సాగునీటి సంఘం ఎన్నికల్లో విజయం సాధించిన సభ్యులు గురువారం శాలువాలతో సన్మానించారు.

అర్ధరాత్రి అనాథలకు దుప్పట్లు

- ఎవరిచ్చారో తెలీకుండా.. నిద్రిస్తున్న వారికి కప్పి వెళ్లిన సేవా బాంధవుడు
- దాతృత్వం చాటుకున్న నీటిపారుదల శాఖ సిఇ కబీర్ బాషా

ప్రజాశక్తి - కర్నూలు అగ్రికల్చర్

తీవ్రమైన చలితో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఇళ్లలో నుంచి బయటకు రాలేని పరిస్థితులు నెలకొన్నాయి. యాచకులు, రోడ్ సైడ్ అడుక్కునే వారు, పేదలు, అనాథలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నగరంలో వివిధ కూడళ్లలో నిద్రిస్తున్న అనాథలకు కర్నూలు నీటిపారుదల శాఖ చీఫ్ ఇంజినీర్ కబీర్ బాషా బుధవారం అర్ధరాత్రి కొత్త దుప్పట్లు కప్పి వెళ్లారు. కబీర్ బాషా మాట్లాడుతూ... చలిలో వణికిపోతున్న వారిని చూసి మనసు కలిచి వేసిందని, కనీసం ఒక రోజు అయిన వారికి కంటి నిండా వెచ్చటి నిద్ర ఇవ్వాలని నిర్ణయించుకున్నానని తెలిపారు. గత 15 ఏళ్లుగా రోడ్లపై, కూడళ్లలో పలు సెంటర్లలో ఉన్నవారికి కొత్త దుప్పట్లను అందిస్తున్నానని, తాను ఇస్తున్నారని ఎవరికీ తెలికూడదని వారు నిద్రిస్తుండగా వారిపై కప్పి వెళ్తానన్నారు. ఇళ్లల్లో మనం చాలా వెచ్చటి నిద్రపోతాం వారికి ప్రతి రోజు ఈ చలికాలం బిక్కు బిక్కుబిక్కుమంటూ నిద్రపోవాలని, అందుకోసం వారికి బుధవారం అర్ధరాత్రి రైల్వే స్టేషన్, పాతబస్టాండ్, కొత్తబస్టాండ్, చౌరస్తా, సి.క్యాంప్ సెంటర్ రాజ్ విహార్ తదితర సెంటర్లలో నిద్రిస్తున్న వారికి కొత్త దుప్పట్లను కప్పివెళ్ళానన్నారు. తనకు చేతనైన సేవను చేస్తున్నానని తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



దుప్పట్లు కప్పుతున్న సిఇ కబీర్ బాషా


సూచన, సలహాలు ఇస్తున్న సబ్ కలెక్టర్, ఎమ్మెల్యే

తాగునీటి సమస్యపై కేంద్రీకరించాలి

- సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, ఎమ్మెల్యే పార్థసారథి

ప్రజాశక్తి - ఆదోని

రానున్న వేసవి దృష్ట్యా నియోజకవర్గంలో తాగునీటి సమస్యను అధిగమించేందుకు దృష్టి కేంద్రీకరించాలని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి సూచించారు. గురువారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ ఆధ్వర్యంలో నీటి విభాగాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్, ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడారు. పట్టణ ప్రజల దాహార్తి తీర్చే బసాపురం సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు మరమ్మతులో ఉన్నందున 70 శాతం మాత్రమే నీటిని నింపుకుంటున్నట్లు తెలిపారు. మూడు నెలల తర్వాత జరిగే పరిణామాలపై తాత్కాలికంగా నీరు నింపుకోవడానికి ముందస్తుగా దృష్టి సారించామన్నారు. బసాపురం ఎస్ఎస్ ట్యాంకు స్లైడ్ మరమ్మతు కోసం రూ.60 లక్షలతో తాత్కాలిక పనులు చేపడతామన్నారు. బసాపురం ట్యాంకుతో పాటు రాంజలను కూడా నింపడానికి ప్రయత్నాలు చేస్తామని తెలిపారు. నిల్వ ఉన్న నీరు సాధారణంగా 33 శాతం ఆవిరి అవుతుందని, పూర్తిగా నింపుకోవడానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రెండు నీటి ఫిల్టర్ బెడ్లు ఆగిపోయాయని, వాటి మరమ్మతులు 70 నుంచి 80 శాతం పనులు ముగిశాక కాంట్రాక్టర్ డబ్బులు తీసుకొని పారిపోయాడని, త్వరలోనే ఆ వ్యక్తిని పట్టుకొచ్చి మరమ్మతులు చేబడుతామని తెలిపారు. రోజుకు 25 వేల మిలియన్ లీటర్ల శుద్ధి నీరు అవసరం కాగా, 3 మిలియన్ లీటర్ల తక్కువ సామర్థ్యంతో ప్రస్తుతం 22 మిలియన్ లీటర్లను వినియోగించుకుంటున్నామని చెప్పారు. తాగునీటి సమస్య పరిష్కారమైతే రోజు విడిచి రోజు నీటిని వాడుకోవచ్చని తెలిపారు. ఎంపిడిఒ రాజేంద్రప్రసాద్, రూరల్ వాటర్ స్కీం డిఇ సాంబయ్య, ఎఇ పద్మజ, డిఎల్‌పిఒ నూర్జహాన్, ఇఒఆర్‌డి జనార్ధన్, మున్సిపాలిటీ ఇఇ ఇంతియాజ్, రామ్మూర్తి గోపీనాథ్ ఉన్నారు.

కప్పట్రాళ్లకు సీజనల్ వసతి గృహం

ప్రజాశక్తి -దేవనకొండ


కప్పట్రాళ్ల హైస్కూల్‌ను సందర్శిస్తున్న గీత

దేవనకొండ మండలం కప్పట్రాళ్ల గ్రామ విద్యార్థులు వలసలు వెళ్లకుండా పాఠశాలలోనే ఉండేలా సీజనల్ వసతి గృహం మంజూరు చేసినట్లు రాష్ట్ర సమగ్ర శిక్ష అధికారి గీత తెలిపారు. గురువారం ఆమె కప్పట్రాళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. రాష్ట్ర ఉత్తమ ఐజి ఆకె రవికృష్ణ దత్తత గ్రామం కప్పట్రాళ్లలో జీవనం నిర్వహించిన మెగా పేరెంట్ సమావేశంలో ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు వలసలు వెళ్తున్న గ్రామస్తులు ఆయన దృష్టికి తెచ్చారు. ఇందుకు స్పందించిన ఆయన విద్యాశాఖ అధికారులతో చర్చించి సీజనల్ వసతి గృహం మంజూరు చేయించారు. గ్రామస్తులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా అసిస్టెంట్ అధికారి సురేష్ రాజు, పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు హేసన్ నాయుడు, సీనియర్ ఉపాధ్యాయులు గోకారి, సిఆర్‌పి గంగన్న పాల్గొన్నారు.

ఉపాధ్యాయుని కుటుంబాన్ని ఆదుకోవాలి

- యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

చిత్తూరు జిల్లాలో ప్రశ్నాపత్రాలు తీసుకురావడానికి వెళ్లిన ఉపాధ్యాయుడు సిద్దయ్య శెట్టి రోడ్డు ప్రమాదంలో మృతి చెందారని, ఆయన కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని యుటిఎఫ్ నాయకులు కోరారు. గురువారం తహశీల్దార్ కార్యాలయం దగ్గర నిరసన చేపట్టారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నాగమణి, జిల్లా గౌరవాధ్యక్షులు దావీదు, జిల్లా కార్యదర్శులు బాబు, కొల్లన్న మాట్లాడుతూ... మృతి చెందిన ఉపాధ్యాయుని సిద్దయ్య శెట్టి కుటుంబాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలని, ప్రశ్నాపత్రాలు పోలీసు స్టేషన్‌లో కాకుండా ప్రభుత్వమే నేరుగా పాఠశాలలకు చేర్చాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులు రాజు, చంద్రపాల్, లక్ష్మన్న, నాగరాజు, శివకుమార్, ప్రశాంత్ భూపాల్, ప్రసాద్, మల్లారి నాగరాజు, నరసింహులు, శాంతరాజు, రమేష్, భాగ్యరాజు పాల్గొన్నారు.



యుటిఎఫ్ ఆధ్వర్యంలో నిరసన తెలియజేస్తున్న ఉపాధ్యాయులు

ప్రజలపై భారాలు

- సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు రాధాకృష్ణ, వెంకటేశులు

ప్రజాశక్తి - మంత్రాలయం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజాసంక్షేమాన్ని పూర్తిగా విస్మరించి ప్రజలపైన అనేక రూపాల్లో భారాల మోపుతున్నాయని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు పిఎస్.రాధాకృష్ణ, కె.వెంకటేశులు మండిపడ్డారు. గురువారం కోసిగిలోని విజయ హోటల్ (ఫంక్షన్ హాల్)లో కరెప్ప అధ్యక్షతన సిపిఎం కోసిగి మండల 3వ మహాసభ నిర్వహించారు. రాధాకృష్ణ, వెంకటేశులు ముఖ్య అతిథులుగా హాజరయి మాట్లాడారు. గత వైసిపి ప్రభుత్వంలో ట్రూ అప్ చార్జీలను వ్యతిరేకించిన కూటమి నాయకులు అధికారంలోకి వచ్చినా గత ప్రభుత్వ విధానాలనే అవలంభిస్తున్నారని విమర్శించారు. ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. మండలంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రజలను సమీకరించి పోరాటాలు నిర్వహించాలని కోరారు. మండలంలో తాగునీటి సమస్య పరిష్కారానికి ఎస్ఎస్ ట్యాంకు ఏర్పాటు చేయాలని, కోసిగి రైతులకు పులికనుమ ప్రాజెక్టు ద్వారా ప్రత్యేక తూము ఏర్పాటు చేసి సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. ఆర్‌డిఎస్ కుడి కాలువ నిర్మాణం చేపట్టాలని, మండలంలో వలసలు అరికట్టాలని కోరారు. రైల్వే లైన్‌పై బ్రిడ్జి ఏర్పాటు చేయాలని, పలు సమస్యలపై తీర్మానాలు చేసి వాటి పరిష్కారానికి కృషి చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సిపిఎం కోసిగి మండల కన్వీనర్‌గా రాముడు, కమిటీ సభ్యులుగా వీరేష్, హనుమంతు, నాగేంద్ర, ఈరన్నను ఎన్నుకున్నారు. వెంకటేశులు, పూజారి శ్రీనివాసులు, హనుమంతు, ముక్కరన్న, నాగరాజు, గోపాల్ పాల్గొన్నారు.



మంత్రాలయంలో మాట్లాడుతున్న నాయకులు

ప్రజాపోరాటాల ద్వారానే పార్టీ విస్తరణ

పెద్దకడబూరు : ప్రజా పోరాటాల ద్వారానే సిపిఎం విస్తరణ పెరుగుతుందని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.రామాంజనేయులు, కె.వెంకటేశులు తెలిపారు. మండలంలోని చిన్నతుంబళంలో జరిగిన సిపిఎం మండల మహా సభకు వారు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం పార్టీ ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రజా పోరాటాల ద్వారానే పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై ప్రజలను చైతన్య పరచి నిరసనలు చేపట్టి, పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం మండల కమిటీని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా తిక్కన్నతో పాటు పరమేష్, ఈరన్న, దేవదాసు, శ్రీనివాసులు, రాజేంద్ర ప్రసాద్, వెంకటేశ్వర్లు, కె.రామన్న జయరాజులను సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.


పెద్దకడబూరులో జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు


నిందితుల అరెస్టును చూపుతున్న సిఐ

యువకునిపై హత్యాయత్నం కేసు నిందితుల అరెస్టు

- ప్రియురాలే సూత్రధారి


ప్రజాశక్తి - గోనెగండ్ల

గత రెండు రోజుల క్రితం మండలంలోని గాజులదిన్నె ప్రాజెక్టు రోడ్డు వద్ద ఎల్ఎల్‌సి కాలువపై ఎమ్మిగనూరుకు చెందిన వడ్డే అరవింద స్వామిపై జరిగిన హత్యాయత్నం కేసులో పోలీసులు నిందితులను అరెస్టు చేశారు. నిందితులు దేవిబెట్ట గ్రామానికి చెందిన ఈడిగ భరత్, అతని ప్రియురాలు బుట్టా ప్రియాంక, స్నేహితులు దేవి బెట్ట గ్రామానికి చెందిన వడ్ల కుమారస్వామి, గంధాల ప్రశాంత్ కుమార్, కోడుమూరు గ్రామానికి చెందిన ఎరుకలి రామాంజనేయులను మండలంలోని బి.అగ్రహారం గ్రామ సమీపంలోని మల్లెల వాగు వంక వద్ద గురువారం అరెస్టు చేసినట్లు గోనెగండ్ల సిఐ గంగాధర్ తెలిపారు. వారి వద్ద నుంచి రెండు ద్విచక్ర వాహనాలు, ఐదు సెల్‌ఫోన్లు, నేరానికి ఉపయోగించిన వేట కొడవళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఆయన వివరాల మేరకు... నిందితుడు ఈడిగ భరత్ ప్రియురాలు బుట్టా ప్రియాంక ఎమ్మిగనూరుకు చెందిన వడ్డే అరవిందస్వామి గతంలో ప్రేమించుకున్నారు. గత కొంతకాలంగా వారు విడిపోయి దూరంగా ఉంటున్నారు. తిరిగి గత మూడు నెలలుగా వడ్డే అరవింద స్వామి భరత్ ప్రియురాలి వెంటపడుతున్నాడు. భరత్, ప్రియురాలు ప్రియాంక, వారి స్నేహితులు వడ్ల కుమారస్వామి, గంధాల ప్రశాంత్ కుమార్, ఎరుకలి రామాంజనేయులు కలిసి అరవింద స్వామిని చంపాలని నిర్ణయించుకున్నారు. వ్యూహాత్మకంగా అతని గాజులదిన్నె ప్రాజెక్టు రోడ్డులోని ఎల్ఎల్‌సి వద్దకు రప్పించి వేట కొడవళ్లతో దాడి చేశారు. ఈ కేసులో నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

ఘనంగా శివారెడ్డిగౌడ్ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - నందవరం

వైసిపి మండల కన్వీనర్, కెడిసిసి బ్యాంకు మాజీ డైరెక్టర్ శివారెడ్డి గౌడ్ పుట్టినరోజు వేడుకలు గురువారం వైభవంగా జరిగాయి. ఎమ్మిగనూరు పట్టణంలోని ఆయన నివాసంలో ఆప్తమిత్రులు, హంస వాయిస్ ఎమ్.డి.దేవేంద్ర రెడ్డి ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. సాక్షి హేమంత్ గౌడ్, ఎమ్మిగనూరు మున్సిపల్ వైస్ ఛైర్మన్ నజీర్ అహ్మద్, కౌన్సిలర్ డిష్ కేశవరెడ్డి, మిత్రులు వెంకట రాఘవ (టీచర్), శిల్పా ఎస్టేట్ రంగన్న, పూలచింత మాజీ సర్పంచి సురేష్ కుమార్ గౌడ్, ముగతి విరుపాక్షి రెడ్డి, నందవరం మండల సోషల్ మీడియా కన్వీనర్ చాంద్, మీసాల సంపత్ గౌడ్, చాంద్ తాత, బోయ బీసన్న, జడ్‌పిటిసి నిఖిల్ చక్రవర్తి, సోమల గూడూరు వెంకటేశ్వర రెడ్డి, రమేష్ గౌడ్, దత్తాత్రేయ గౌడ్, బసవరాజు గౌడ్ పాల్గొన్నారు. అనంతరం శివారెడ్డి గౌడ్ చేతులమీదుగా కేక్ కట్ చేయించి సంబరాలు చేసుకున్నారు.



గ్రామాల్లో సమస్యలను పరిష్కరించాలి

- ఎంపిడిఒ అల్లా బకాష్

ప్రజాశక్తి - చిప్పగిరి

గ్రామాల్లో విధులు నిర్వహిస్తున్న ప్రతి అధికారి కూడా తమ పరిధిలో ఉన్న ప్రతి సమస్యనూ పరిష్కరించేలా ఉండాలని ఎంపిడిఒ అల్లా బకాష్ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. గురువారం ఇఒఆర్‌డి బాలన్న ఆధ్వర్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సుపరిపాలన వారోత్సవాల నిర్వహిస్తున్న నేపథ్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రత్యేక శిబిరం, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం సుపరిపాలన అనే పేరుతో ప్రజలతో మమేకమై ఏ సమస్యలు ఉన్నా తెలుసుకొని ప్రజా పరిష్కార వేదిక ద్వారా పరిష్కరించేందుకు కృషి చేస్తోందన్నారు. ఇందులో ప్రజాప్రతినిధులు, అధికారుల భాగస్వామ్యం ఉండేలా చూసుకోవాలన్నారు. సురేంద్రనాథ్, జయరాం నాయక్, సుధీర్, నరసింహులు, ప్రమీల, అస్పిరేషనల్ అధికారి నరసింహులు పాల్గొన్నారు.



ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రత్యేక శిబిరంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ

రైతు సమస్యల పరిష్కారానికే సదస్సులు

- సర్పంచి గోవిందరాజులు, ప్రత్యేకాధికారి విజయ్ కుమార్

ప్రజాశక్తి - చిప్పగిరి

రైతుల సమస్యలను నివృత్తి చేసేందుకు, పరిష్కరించడానికే రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని సర్పంచి దాసరి గోవిందరాజులు, మండల ప్రత్యేకాధికారి విజయ్ కుమార్, తహశీల్దార్ ఇజాజ్ అహ్మద్ తెలిపారు. గురువారం చిప్పగిరి సచివాలయ కార్యాలయంలో రెవెన్యూ కార్యదర్శి గోవిందప్ప ఆధ్వర్యంలో గ్రామ రెవెన్యూ సదస్సు నిర్వహించారు. సమస్యలు ఉన్న రైతులందరూ వివరాలతో కూడిన దరఖాస్తులను అధికారులకు అందజేశారు. చుక్కల భూముల సమస్య, సర్వే నెంబర్లు వేర్వేరుగా ఉండడం వంటి సమస్యలను అధికారుల ఆదేశాల మేరకు 15 రోజుల్లోపు పరిష్కరిస్తామని రైతులకు వివరించారు. టిడిపి నాయకులు కొండ గోవిందు, పోతరాముడు, జనార్దన స్వామి, బోగేష్, సర్వేయర్ నారాయణ, పంచాయతీ కార్యదర్శి సురేంద్ర, విఆర్‌ఒలు మల్లికార్జున, పెద్దన్న, వన్నూరు, హనుమ నాయక్ పాల్గొన్నారు. **మంత్రాలయం:** పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన గ్రామ సభ ద్వారా రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తహశీల్దార్ ఎస్.రవి మాట్లాడుతూ... భూముల సంబంధించి రైతుల నుంచి పది దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి తమ పరిధిలో ఉన్న వాటిని వెంటనే పరిష్కరిస్తామని, లేని వాటిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. మండల సర్వేయర్ అశోక్, విఆర్‌ఒలు భీమనగౌడ, భీమయ్య, ఆనందం పాల్గొన్నారు. **హోళగుంద:** మండలం సులువాయి గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహశీల్దార్ సతీష్, పంచాయతీ కార్యదర్శి రంగస్వామి పాల్గొన్నారు.


చిప్పగిరి రెవెన్యూ సదస్సులో దరఖాస్తులను స్వీకరిస్తున్న అధికారులు



మంత్రాలయంలో దరఖాస్తులను స్వీకరిస్తున్న అధికారులు

అస్ఫాఖుల్లా ఖాన్, రాంప్రసాద్ బిస్మిల్ వర్ధంతి

ప్రజాశక్తి - కోడుమూరు రూరల్

భారత స్వాతంత్ర్య సమరయోధులు అస్ఫాఖుల్లా ఖాన్, రాంప్రసాద్ బిస్మిల్ వర్ధంతి సందర్భంగా ఆవాజ్ కార్యాలయంలో నివాళులర్పించారు. గురువారం ఆవాజ్ జిల్లా అధ్యక్షులు ముస్తఫా అధ్యక్షతన అఖిలపక్ష పార్టీలు, కుల సంఘాలు, స్వచ్ఛంద సంస్థల నాయకులు వారికి నివాళులర్పించారు. ఆవాజ్ మండల కార్యదర్శి మహ్మద్ మాట్లాడుతూ... దేశానికి పరదేశీయుల పాలన నుంచి విముక్తి కల్పించేందుకు ప్రాణ త్యాగం చేసిన మహనీయులు అస్ఫాఖుల్లా ఖాన్, రాంప్రసాద్ బిస్మిల్ అని తెలిపారు. ఎంఆర్‌పిఎస్ నాయకులు ఆంధ్రయ్య, సిపిఐ డివిజన్ కార్యదర్శి రాజు, సిపిఎం నాయకులు ఈరన్న, ఆవాజ్ పట్టణ అధ్యక్షులు ఖాజీ మహ్మద్ ఇస్సాక్, హుస్సేన్ పీరా, మిన్నెల్లా, హుస్సేనప్ప, పైల్వాన్ బాష, అజీజ్, రఫీ, ఆర్.ఖాజా, ఎద్దుల మహబూబ్ పాల్గొన్నారు.


సమస్యలపై సాగదీత..!

- ప్రచారానికే రెవెన్యూ సదస్సులు

- అధికారుల వైఖరికి నిరసనగా సిపిఎం బైఠాయింపు

ప్రజాశక్తి - దేవనకొండ

రీసర్వేలో వచ్చిన రెవెన్యూ సమస్యలపై అధికారులు సాగదీత ధోరణి, నాన్చుడు వైఖరి అవలంభిస్తున్నారని సిపిఎం నాయకులు మండిపడ్డారు. పాలకుర్తిలో జరిగిన రెవెన్యూ సదస్సు సందర్భంగా సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తహశీల్దార్ కారు ముందు సిపిఎం నాయకులు బైఠాయించారు. గురువారం మండలంలోని పాలకుర్తి గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. సిపిఎం జిల్లా నాయకులు బి.వీరశేఖర్ పాలకుర్తి రెవెన్యూ పరిధిలోని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. తహశీల్దార్, ప్రత్యేకాధికారి మొక్కుబడిగా సమాధానం చెప్పి వెళ్లిపోతుండగా సిపిఎం నాయకులు వీరశేఖర్, మహబూబ్ బాషా, శ్రీనివాసులు తహశీల్దార్ కారు ముందు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. రీసర్వే జరిగి పది నెలలు గడుస్తున్నా.. అధికారులు దృష్టికి వస్తున్న సమస్యలపై రెవెన్యూ అధికారులు నాన్చుడి ధోరణితో సాగదీస్తున్నారని విమర్శించారు. తెర్నేకల్ రెవెన్యూ పరిధిలోని సమస్యలను గత పది నెలలుగా... అక్టోబర్ మాసంలో జరిగిన రెవెన్యూ సదస్సులోనూ అధికారుల దృష్టికి తెచ్చినా ఏ మాత్రం ప్రయోజనం లేదని, సమస్యలపై అధికారులకు చిత్తశుద్ధి లేదని నిరసన వ్యక్తం చేశారు. తహశీల్దార్ మాట్లాడుతూ... తమ దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరిస్తామని చెప్పడానికి ప్రయత్నం చేశారు. కచ్చితంగా నెలలోపు సమస్యలు పరిష్కరిస్తామని రెవెన్యూ అధికారులు హామీ ఇవ్వడంతో సిపిఎం నాయకులు నిరసనను విరమించారు. పాలకుర్తి, తెర్నేకల్ గ్రామస్తులు, రైతులు, అర్జీదారులు పాల్గొన్నారు.


తహశీల్దార్ ముందు బైఠాయించిన సిపిఎం నాయకులు

శ్రీమఠంలో భక్తుల కోలాహలం

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో కొలువైన రాఘవేంద్రస్వామిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులతో శ్రీమఠంలో కోలాహలం నెలకొంది. గురువారం స్వామివారి దర్శనార్థమై దేశ నలుమూలల నుంచి వచ్చిన భక్తులు గ్రామ దేవత మంచాలమ్మను, రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శించుకొనేందుకు బారులు తీరారు. స్వామివారికి ప్రత్యేక సేవలు చేయించిన భక్తుల సమక్షంలో రాఘవేంద్రుని బృందావన ప్రతిమకు విశేష పూజలు నిర్వహించి, మంగళ హారతులు ఇచ్చారు. అనంతరం బృందావన ప్రతిమను స్వర్ణ పల్లకిలో ఉంచి మేళతాళాలు, మంగళ వాయిద్యాల మధ్య శ్రీమఠం ప్రాకారంలో ఘనంగా పల్లకోత్సవం నిర్వహించారు.

పిల్లల సమగ్రాభివృద్ధికి కృషి

- ఎంఇఒ సుదర్శన్ రెడ్డి

ప్రజాశక్తి - నందవరం

చిన్నపిల్లల విద్య, పోషణతో పాటు వారి సమగ్రాభివృద్ధికి కృషి చేయాలని ఎంఇఒ సుదర్శన్ రెడ్డి తెలిపారు. గురువారం నందవరంలోని ఎపి మోడల్ స్కూల్‌లో జ్ఞాన జ్యోతి రోజుల శిక్షణ కార్యక్రమంలో భాగంగా మూడు రోజుల శిక్షణ కార్యక్రమం కెఆర్‌పిలతో డిఆర్‌పిలకు ఎంఇఒ సుదర్శన్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. శిక్షకులు కెఆర్‌పిలు ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సుచరిత, వెంకటరమణ, రాష్ట్ర పర్యవేక్షకులు కల్పన, అపర్ణ, కర్నూలు జిల్లా సమగ్ర శిక్ష అసిస్టెంట్ మానిటరింగ్ అధికారి రఫిక్, జిల్లా ప్రథమ్ కోఆర్డినేటర్ దావీదు, సిఆర్‌ఎంటి ఉరుకుంద పాల్గొన్నారు.

తాత్కాలికంగా మున్సిపల్ కార్మికుల సమ్మె విరమణ

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

మునిసిపల్ ఇంజనీరింగ్ సెక్షన్ కార్మికులు సమ్మెను తాత్కాలికంగా విరమించారు. సిడిఎంఎ కార్యాలయంలో గురువారం అన్ని సంఘాల నాయకులతో అధికారులు చర్చలు నిర్వహించారు. మునిసిపల్ శాఖ మంత్రి, ప్రిన్సిపల్ సెక్రటరీ సమక్షంలో మరోమారు సమావేశం ఏర్పాటు చేసి న్యాయం జరిగేలా చూస్తామని చెప్పడంతో సమ్మెను తాత్కాలికంగా విరమిస్తున్నట్లు ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం శ్రీనివాసులు తాత్కాలికంగా గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

బకాయి నిరూపిస్తే దేనికైనా సిద్ధం..!

- ఎమ్మెల్యే పార్థసారథికి కాంగ్రెస్ ఇన్‌ఛార్జీ రమేష్ యాదవ్ సవాల్

ప్రజాశక్తి - ఆదోని

రూ.2 లక్షల బకాయి ఉన్నట్లు ఎమ్మెల్యే పార్థసారథి ఆరోపించడం విడ్డూరంగా ఉందని, తాను మున్సిపాలిటీకి బకాయి ఉన్నట్లు నిరూపిస్తే దేనికైనా సిద్ధమని, నిరూపించకపోతే ఎమ్మెల్యే పార్థసారథి కూడా తాను పెట్టే షరతులకు సిద్ధంగా ఉంటారా అని కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జీ రమేష్ యాదవ్ సవాల్ విసిరారు. గురువారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణ ప్రజల సమస్యలు చర్చించి పరిష్కరించాల్సిన మున్సిపల్ కౌన్సిల్‌లో రాజకీయ ప్రయోజనాల కోసం అర్థం లేని మాటలు మాట్లాడడం ఎమ్మెల్యేకు తగదన్నారు. అనవసరంగా ఆరోపణలు చేయడం, దిగజారుడు మాటలు మానుకోవాలని హితవు పలికారు. భవిష్యత్తులో ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. మున్సిపాలిటీకి పన్ను ఎగవేశారని కౌన్సిల్‌లో ఎమ్మెల్యే అబద్ధాలు మాట్లాడడం సబబు కాదన్నారు. రూ.2లక్షలకు బదులు రూ.4 లక్షలు చెల్లిస్తానని, లేకపోతే ఎమ్మెల్యే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఆదోనిలో ఓటర్లకు డబ్బులు ఇచ్చి ఎన్నికల్లో విజయం సాధించారని, రూపాయి ఖర్చు చేయకుండా 8 వేల మంది తనకు ఓట్లు వేశారని తెలిపారు. నిజమైన విజయం తనదే అన్నారు. గతంలో ఎప్పుడూ లేనివిధంగా ఆదోని మున్సిపల్ కౌన్సిల్‌ను బిజెపి కార్యాలయంలా మార్చారని, బిజెపి నాయకులు, పోలీసులు హాల్ లోపలికి రావడం ఏమిటని ప్రశ్నించారు. ఆరు నెలల్లో ఆదోనికి ఎమ్మెల్యే చేసిందేమీ లేదని, ఫండ్స్ తెచ్చింది కూడా ఏమీ లేదని తెలిపారు. కేవలం రోడ్లపై జీవించే వారిపై పోలీసుల ద్వారా ప్రతాపం చూపించి.. వారి కడుపు కొడుతున్నారని విమర్శించారు. మెడికల్ కళాశాల నిర్మాణం ప్రభుత్వం ఎందుకు ఆపిందని, ఉన్న వైద్యులు కూడా 70 మంది దాకా వెళ్లిపోయారని తెలిపారు. దీనిపై ఎందుకు ఎమ్మెల్యే మాట్లాడటం లేదని ప్రశ్నించారు. పన్నుల బకాయిలుంటే కౌన్సిలర్లు కానీ, ప్రజలు కానీ మార్చి చివరి వరకు చెల్లించవచ్చన్న ప్రభుత్వ నిబంధనలు కూడా ఎమ్మెల్యేకు తెలియకుండా పోయిందన్నారు. ఒక బీసీ వర్గానికి చెందిన ఎమ్మెల్యే గెలుపొంది ఏమీ చేయకపోవడంతో బీసీలు ఆదోనిలో తల దించుకునే విధంగా ఉందన్నారు. ఎమ్మెల్యే ఆదోని అభివృద్ధిపై దృష్టి పెట్టి కేంద్రం నుంచి ప్రత్యేకంగా నిధులు తేవాలని, ఇలా వేధింపులు చేయడం మానుకోవాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా మాజీ ఉపాధ్యక్షులు దిలీప్ ఢోకా మాట్లాడుతూ...పన్నులు బకాయిలపై ఆధారాలుంటే చూపించాలని, బకాయి ఉన్న వారి కాలర్లు పట్టుకోవాలని ప్రజలను రెచ్చగొట్టడం తగదని తెలిపారు. బకాయిలుంటే కాలర్ పట్టుకోవాలని ఎమ్మెల్యే చెప్పడం ఏమిటని, నాలుగేళ్ల తర్వాత ఎవరి కాలర్ పట్టుకోవాలో ప్రజలే చెబుతారని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు సాయినాథ్ పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆదివాసి ఛైర్మన్ మారుతి, పట్టణ అధ్యక్షులు దేవిశెట్టి వీరేష్, ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర అదనపు కార్యదర్శి శ్రీనిత్ ఉన్నారు.


మాట్లాడుతున్న రమేష్ యాదవ్

అమిత్ షా క్షమాపణ చెప్పాలి : కెవిపిఎస్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పార్లమెంటు సభలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర మంత్రి అమిత్ షా తక్షణమే క్షమాపణ చెప్పాలని, కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేయాలని కెవిపిఎస్ నాయకుల డిమాండ్ చేశారు. గురువారం కెవిపిఎస్ ఆధ్వర్యంలో సోమప్ప సర్కిల్ నుంచి ర్యాలీగా వెళ్లి అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కెవిపిఎస్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.తిమ్మన్న, చిన్నప్ప మాట్లాడుతూ... దేశంలో 3 వేల సంవత్సరాల నుంచి ఏదో ఒక రూపంలో మనువాదం, బ్రాహ్మణ భావజాలమే రాజ్యమేలుతోందని తెలిపారు. చర్మ కళాకారుల జిల్లా కార్యదర్శి సుమాల ఆంథోని, జిల్లా ఉపాధ్యక్షులు సుమాల రాజు, భాస్కర్, కెవిపిఎస్ నందవరం మండల నాయకులు, గోవిందు, మండల నాయకులు అరుణ్, రాముడు, గోవిందు, రంగన్న, గుండప్ప పాల్గొన్నారు. అలాగే సమతా సైనిక్ దళ్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సంద్భంగా రంగయ్య మాట్లాడారు. అంబేద్కర్ ఫొటోను అడ్డు పెట్టుకుని రాజకీయ పబ్బం గడిపే వారికి అంబేద్కర్ అంటే ఏమిటో ఎలా తెలుస్తుందని ప్రశ్నించారు. రెండు రోజుల్లో బహిరంగ క్షమాపణ చెప్పకపోతే ఉద్యమిస్తామని హెచ్చరించారు. సమతా సైనిక్ దళ్ జిల్లా, డివిజన్ నాయకులు పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహం ముందు నిరసన తెలుపుతున్న నాయకులు


నిరసన తెలియజేస్తున్న సమతా సైనిక్ దళ్ కార్యకర్తలు

మల్లెల గ్రూప్స్ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు

- 300 మంది వికలాంగులకు, వృద్ధులకు, వితంతువులకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పట్టణంలోని క్రిస్టియన్ రిఫార్మ్‌డ్ చర్చి ఆవరణలో మల్లెల గ్రూప్స్ అధినేత డాక్టర్ మల్లెల ఆల్ఫ్రెడ్ రాజు ఆధ్వర్యంలో గురువారం అందరి క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా 300 మంది వికలాంగులకు, వృద్ధులకు, వితంతువులకు దుస్తులు పంపిణీ చేశారు. సిఆర్‌సి చర్చి పాస్టర్ ఎం.ఎస్.రవితేజ వాక్యోపదేశం చేశారు. మల్లెల ఆల్ఫ్రెడ్ రాజు సతీమణి సిస్టర్ మల్లెల సునీల ఆలపించిన క్రైస్తవ మధుర గీతాలు ఆకట్టుకున్నాయి. టిడిపి నాయకులు కదిరికోట ఆదెన్న, ఎంపిజె రాష్ట్ర ఉపాధ్యక్షులు లాల్ కోట ఖదీర్, జమాత్-ఎ- ఇస్లామ్ హిందూ అధ్యక్షులు చాంద్ బాష మాట్లాడుతూ... ఆల్ఫ్రెడ్ రాజు కుల, మతాలకు అతీతంగా చేస్తున్న సామాజిక సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. గత 19 ఏళ్ల నుంచి క్రిస్మస్ సందర్భంగా పేదలకు దుస్తులు పంపిణీ చేయడం సంతోషకరమన్నారు. ఆల్ఫ్రెడ్ రాజు తల్లిదండ్రులు జీవరత్నం, సుశీలమ్మల స్ఫూర్తితో అణగారిన వర్గాలకు అండగా ఉంటున్నారని తెలిపారు. సిఆర్‌సి చర్చి సంఘ పెద్దలు దేవ ప్రసాద్, సాల్మన్, ఐడియల్ యూత్ మూవ్‌మెంట్ అధ్యక్షులు ముల్లా ఇస్మాయిల్, వికలాంగుల హక్కుల పోరాట సమితి నాయకులు బీసీ.నాగరాజు, పూలే, అంబేద్కర్ ఎడ్యుకేషనల్ సొసైటీ డైరెక్టర్ సింగనేటి నరసన్న, ప్రతిభా భారతి, బీసీ సంఘం నాయకులు డాక్టర్ గణేష్, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ మహిళ ఐక్యవేదిక నాయకులు ఈ.భారతమ్మ, వ్యవసాయ మార్కెట్ కమిటీ సూపర్‌వైజర్ యు.రాము, మల్లెల గ్రూప్ సభ్యులు న్యూ లైఫ్ సామ్యేలు, శంకర్, అజిత్, హనుమంతు పాల్గొన్నారు.


దుస్తులు పంపిణీ చేస్తున్న ఆల్ఫ్రెడ్ రాజు

మెళకువలు పాటించాలి

- సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ప్రజాశక్తి - ఆదోని

వస్తు, సామగ్రి కొనుగోళ్లలో మెళకువలు పాటిస్తూ వినియోగదారులు మేల్కోవాలని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ తెలిపారు. గురువారం జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా పట్టణ వీధుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పాల్గొనేందుకు కర్నూలు నుంచి వచ్చిన జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి రఘువీర్ మాట్లాడుతూ... ఎంఆర్‌పి అంటే ఎక్కువ ధరకు విక్రయించినా, కల్తీ వస్తువులతో నకిలీ విత్తనాలతో మోసం జరిగినా సంప్రదించాలన్నారు. ఆరోగ్యకరమైన ఆహారం విషయంలో వినియోగదారులు మోసపోవద్దని వివరించారు. వినియోగదారుల హక్కులు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ర్యాలీలో వినియోగదారుల హక్కులపై అవగాహన, చైతన్యం తెచ్చే విధంగా విద్యార్థులు, వినియోగదారుల ఫోరమ్ సభ్యులు నినాదాలు చేశారు. ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా ఆదోని కంజ్యూమర్ ఫోరమ్‌ను సంప్రదించవచ్చని వినియోగదారుల రక్షణ మండలి ఆదోని డివిజన్ అధ్యక్షులు ఈసా బాష తెలిపారు. తహశీల్దార్ శివ రాముడు, సిఎస్ డిటి వలీ బాషా, వినియోగదారుల కమిషన్ సభ్యులు నాజిమ కౌసర్, సిపిసి జిల్లా కార్యదర్శి శివ మోహన్ రెడ్డి, ఆదోని సిపిసి ఉపాధ్యక్షులు గౌసూల్ వరా, వినియోగదారుల సంఘం కోశాధికారి జిందే నరసింహా, సభ్యులు క్లాసిక్ గౌస్ నిజామి, మజహర్ పాల్గొన్నారు.

సమయ పాలన పాటించాలి

- సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ప్రజాశక్తి - పెద్దకడబూరు

తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది సమయ పాలన పాటించాలని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ ఆదేశించారు. గురువారం పెద్దకడబూరులోని తహశీల్దార్ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. రెవెన్యూ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యాలయంలో పని చేసే సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆదోని డివిజన్‌లో అత్యధికంగా రెవెన్యూ ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చిన వినతులు మండలంలోనే పెండింగ్ ఉన్నాయన్నారు. వీటిపై విఆర్ఒ, సర్వేయర్ ప్రణాళిక రూపొందించుకుని భూ సమస్యలను వేగంగా పరిష్కరించాలన్నారు. వీటిపై ఎప్పటికప్పుడు తహశీల్దార్ పర్యవేక్షణ చేయాలని సూచించారు. గ్రామసభలకు వచ్చిన వినతులు, వాటి పరిష్కారం గురించి తహశీల్దార్ శ్రీనాథ్‌ను అడిగి తెలుసుకున్నారు. ఎఎస్ఒ వెంకటేశ్వర్లు, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాసులు, మండల సర్వేయర్ (ఇన్‌ఛార్జి) అల్లప్ప పాల్గొన్నారు.